# సంసారం ఒంటెద్దు బండి

"సాధారణంగా మీరు ఏ టైములో రాస్తారు కథలు?" అడిగాడతను జర్నలిస్టులకి అక్కర్లేని విషయాల్లేవు.

"ఏ టైమేవిటి?"

నిన్న సాయంత్రం నవల రాద్దావనే కూర్చున్నాను.

అవసరం కొందరిచేత ఖూనీలు చేయిస్తుంది, కొందరిచేత దానాలు చేయిస్తుంది, నాచేత కథలు రాయిస్తుంది.

పేజీ రాసేనో లేదో వీధిలో కారు హోరన్ వినిపించింది. యుద్ధం టైంలో బ్లాకౌట్ రోజుల్లో సైరన్ వినగానే ఎక్కడి వాళ్ళక్కడ పారిపోతారు. వీధి చివర మా కారు హోరను వినగానే పిల్లలు జవాన్లు ఎక్కడి వాళ్ళక్కడ సర్దుకుంటారు.

"ఆవిడ కేం? మంచి మొగుడూ, బోలెడు హోదా" అంటారు చాలామంది.

నిజవే. "మంచి" ప్రపంచానికీ, మొగుడు నాకూను. మా వారి ఇన్ అండ్ ఔట్ చెప్పడానికి నేమ్ ప్లేట్ అక్కర్లేదు. నా మొహమే చాలు.

మా ఇల్లు స్మశానంలా నిశ్శబ్దంగానూ నేను అప్పుడే తల్లిని తగలబెట్టినదాన్లా దీనంగానూ ఉంటే, అతను ఇంట్లోనే ఉన్నట్టు

నిన్న......

కోర్టునుంచి వస్తూనే "ఓ కప్పు కాఫీ నా మొహాన..." అయన వాక్యం ప్రారంభంలోనే వంటింట్లోకి పరిగెత్తేను.

"ఏవిటిది? కాఫీయే?" నోట్లో పెట్టుకోకుండానే అడిగేరు.

తలాడించేను.

"ఔను గాని అమ్మడూ ఈ మధ్య మనింట్లో చింతపిక్కలుండాలి. ఏంచేశావ్?" నవ్వుతూనే అడిగినా నేనెప్పుడూ మోసపోను.

ఎండలో వున్న కప్ప కోసం పాము పట్టిన పడగ నీడ లాంటిదా నవ్వు.

"చింత తోటవేయిద్దామని దాచావా?"

"జవాన్లు పట్టుకుపోయినట్టున్నారు." నేనెప్పుడూ ఆయనతో ఢంకా బజాయించి మాట్లాడను.

"కాకి ఏ రంగులో వుంటుంది?" అని ఆయన సరదాగా అడిగినా సరే "నల్లగా ఉంటుందనుకుంటానండీ" అంటానే కాని "నల్లగా ఉంటుంది" అని కమిట్ కాను.

"ఏమోలే. పొదుపు పొదుపని కాకిలా అరుస్తున్నాడు, వీడికింతేశాస్తి అని చింతపిక్కల కాఫీ కలుపుతున్నావేమోనని"

ఎన్ని మొట్టికాయలు తిన్నా నా బుర్ర ఆత్మాభిమానంతో సలుపుతూనే వుంటుంది.

"తాగి చూడకూడదా?" గొణిగేను.

"రంగు చూస్తేనే కడుపు నిండిపోతోంది. అయినా పాపం నీకు కాఫీ గురించి, మొగుడి గాడిగురించి ఆలోచించే టైమెక్కడిది? ప్రఖ్యాత రచయిత్రివి. కథలే రాస్తావా? కాఫీయే కలుపుతావా?" అంటూ కప్పు చేతిలో పెట్టారు.

బతుకు జీవుడా అని వంటింట్లోకి పారిపోయేను. వంట అయిపోయినా.

మరో అయిదు నిమిషాలకో, నాలుగున్నర నిమిషాలకో "ఒరేయ్? ఎవరక్కడ?" అని బాత్రూములోంచి వినిపించిన పొలికేకకి వంటింట్లోంచి నేను. వీధిలోంచి జవాన్లు పాతికమైళ్ల స్పీడులో పరుగెత్తాం.

ఇదివరకోసారి "ఎవరక్కడ?" అని పిలిస్తే, "ఎవరూ లేరండీ" అన్నాను. జవాన్లని పిలుస్తున్నారనుకొని.

ప్లీడర్ని కట్టుకోవడం పాపం.

జడ్జీని కట్టుకోవడం మహాపాపం.

ఇన్నేళ్ళు కాపరం చేసిన ఆయన లాంగ్వేజి న్యూయాన్సెస్ నా కర్థం కావు.

"పాపం నువ్వు ఎవరూ కావా" అన్నారు. అంతే. అప్పటినుంచి "ఎవరక్కడ" అన్నప్పుడల్లా నేనూ పరుగెడుతున్నాను.

భగవాన్ ఈయనగాని కాలు జారలేదు గదా భయంభయంగా తొంగిచూసేను బాత్రూములోకి.

సబ్బు అడ్వర్ టైజ్ మెంటులా నిల్చున్నారాయన చేతిలో సబ్బుపెట్టితో. సబ్బు పెట్టెనిండా నీళ్ళున్నాయి. "నేనెల్లప్పుడు నా చర్మ సౌందర్యమునకు ఫలానా సబ్బు వాడతాను" అంటున్న సినీమా స్టార్లా స్నానం చేస్తోంది అందులో సబ్బు.

"నెలకెన్ని సబ్బులు కొంటారండి సుందరమ్మగారూ"

ఏదో సబ్బు కంపెనీ ఇంటర్వ్యూలా ఉంది.

"ఏడో, పన్నెండో అనుకుంటాను"

"ఖచ్చితంగా తెలీదన్నమాట. ఔనుమరి. ఒక జడ్జీ కూతురివి. మరో జడ్జి పెళ్ళానివి. పైగా బిజీ రైటరువి. నవలలే రాసుకుంటావా? వెధవ సబ్బులే లెక్కపెడతావా? పో. పోయి కథలు రాసుకో..."

ఎంత స్పీడుగా వచ్చేనో అంత స్పీడుగానూ పారిపోయేను. కథ వ్రాసుకోవడానిక్కాదు. కన్నీళ్ళాపుకోవడానికి.

మొగుడు గొప్పవాడైతే పెళ్ళానికి గర్వం.

పెళ్ళాం గొప్పదైతే మొగుడికి గర్వభంగం.

"డర్టీ స్కాండ్రల్స్. శుచి, శుభ్రం లేవు. సబ్బుపెట్టెలో నీళ్ళు ఒంపడం, ఒత్తుకున్న తువ్వాలు ఆరేయడంవంటి కనీసపు మంచి అలవాట్లు కూడా లేవు. గృహిణికి బాధ్యతలేని కొంప యిలాగే అఘోరిస్తుంది. రెండు వేలు తెచ్చుకుంటున్న నాకంటె రెండు వందలు తెచ్చుకుంటున్న నాజవాను నయం. లైఫ్ సీక్రెట్ తెలుసువాడికి. ఫస్టు తారీకున జీతం పుచ్చుకోవడం మర్చిపోతాడేమో గాని పెళ్ళాన్ని ఉతకడం మాత్రం మరచిపోడు...ఛీ....ఛీ... గాంధీ గారిక్కూడా పిచ్చెక్కించేస్తారు ఈ ఇంట్లో" నాకంటె ముందుగానే వెళ్ళిపోతున్నాయి మాటలు.

గాంధీగారి మాటెలావున్నా నాకు పిచ్చెక్కడం ఖాయం.

సంసారం రెండెడ్ల బండి అన్నవాడెవడోగాని ఇద్దరు పెళ్ళాలవాడై ఉంటాడు.

సంసారం ఒంటెద్దు బండి మాత్రమే.

బండి మొగుడు, పిల్లలు పాసింజర్లు. ఎద్దు ఎవరో చెప్పనవసరం లేదు.

"సర్వనదీ సాగరం గచ్ఛతి" అని మావారెక్కడ ఎత్తుకున్నా నా కథల దగ్గరే ఆగుతారు.

"ఇంతకీ ఇన్ని బాధలుపడి ఈ కథలు రాయకపోతేనేం?" అని అప్పుడప్పుడు నాకనిపిస్తుంది.

"ఇంతకీ ఇలా మీరు కథలు రాయడానికి ఇంతమంచి రైటరవడానికి ఎవరి ప్రోత్సాహం ఉందంటారు? అన్న జర్నలిస్టు ప్రశ్నతో నిన్నటి గతంలోంచి నేటి వాస్తవానికి వచ్చేను."

"నా ఖర్మ" అందామనుకున్నాను.

"అదేమిటండీ. జడ్జిగారి ఎంకరేజిమెంటు వుంటే క, ఖలు రానివాడికన్నా కవిత్వం వస్తుంది. పెన్సిలు పట్టుకోవడం రానివాడైనా పెయింటరు అయిపోతాడు. అంత గొప్పగా ఎంకరేజ్ చేస్తారాయన" అన్నాడు అక్కడే వున్న ఫ్రెండు అచ్యుతరావు.

నంగిరి నవ్వే నా సమాధానం.

*('ఆంధ్రజ్యోతి' దినపత్రిక, 31-5-1978.)*

★ ★ ★